క్లుప్తంగా...

ఈఎంఆర్ఐ సంస్థలో ఉద్యోగ నియామకాలు

గౌలిపురా: ఈఎంఆర్ఐ (108) సంస్థలో పైలట్ (డ్రైవర్), ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ (ఈఎంటీ) ఉద్యోగాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రొగ్రామ్ మేనేజర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్, జిరాక్స్‌లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పైలట్ (డ్రైవర్)కు పదో తరగతి అర్హత ఉండి 23–35 ఏళ్ల వయస్సు, ఎల్ఎంవీ లైసెన్స్ కలిగి ఉండి హైదరాబాద్ జిల్లాలో పని చేయాలన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్‌కి బీఎస్సీ (బీజెడ్సీ), బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బి.ఫార్మసి, డి.ఫార్మసి, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ 30 ఏళ్ల లోపు ఉండాలన్నారు. కింగ్‌కోఠిలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి 108 రీజినల్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల్లో లోపు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 11వ తేదీ లోపు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. వివరాలకు 90000 01674లో సంప్రదించాలన్నారు.

ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడిగా రవికుమార్


రవికుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎఫ్‌టీసీసీఐ సిబ్బంది

నాంపల్లి: తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఇటీవల నిర్వహించిన ఫెడరేషన్ మేనేజింగ్ కమిటీ సమావేశంలో 2023–24వ సంవత్సరానికి నగరానికి చెందిన టెక్నోక్రాట్, పారిశ్రామికవేత్త రాచకొండ రవికుమార్ (61) ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మణ్, షేక్ హసన్, దయానంద్, సురేష్, నరసింహ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ నేతలు



గోల్కొండ: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ని కార్వాన్ బీజేపీ నాయకులు ఆదివారం కలిశారు. ప్రధాని నరేంద్రమోదీ చిత్రం ఉన్న జ్ఞాపికను ఆయనకు అందజేశారు. కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్, బీజేవైఎం నాయకులు యోగ్‌రాజ్‌సింగ్ తదితరులున్నారు.

గోల్కొండ జోన్ ఏసీపీకి సన్మానం


సయ్యద్ ఫయాజ్‌ను సన్మానిస్తున్న శేఖర్‌రెడ్డి తదితరులు

గోల్కొండ: తెలంగాణ ప్రభుత్వం పోలీసు శాఖను సమూలంగా మార్చి పోలీసులు మరింత సమర్థవంతంగా పని చేసేలా అవసరమైన చర్యలు తీసుకుందని గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం ఆయనను బీఆర్ఎస్ నాయకులకు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం, నేర నియంత్రణ, నేరగాళ్లను పట్టుకునేందుకు అత్యాధునిక పద్ధతుల్లో పోలీసులు పని చేయడం వల్ల నేరస్తుల ఆటలు సాగడం లేదన్నారు. ముఖ్యంగా డ్రగ్ ఫ్రీ హైదరాబాద్ అనే పోలీసుల విధానం బాగా పని చేసిందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గం హడ్‌హక్ కమిటీ సభ్యుడు సీహెచ్.శేఖర్‌రెడ్డి, శేఖర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

పాలాభిషేకం



గౌలిపురా: ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడాన్ని పురస్కరించుకొని బీజేపీ యాకుత్‌పురా నియోజకవర్గం నాయకులు ఆదివారం మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. యాకుత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ గౌలికర్ ధీరజ్ లాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, నాయకులు భాస్కర్ రాజ్, మాదరి చంద్రశేఖర్, రఘుకాంత్, మహేశ్వర్, పొన్న శ్రీనివాసారావు, వెంకటేష్, అశోక్ పాల్గొన్నారు.

ఉప్పుగూడ రైల్వే స్టేషన్ | పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

చాంద్రాయణగుట్ట: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఉప్పుగూడ రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.26.80 కోట్లతో చేపట్టనున్న ఈ పనులకు ఉప్పుగూడ స్టేషన్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత కిన్నెర మొగిలయ్య, కార్పొరేటర్లు ఆలే భాగ్యలక్ష్మి, శ్వేత మధుకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పాతబస్తీకి అమృత్ భారత్ పథకంలో భాగంగా ఉప్పుగూడను ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. పవన్ కల్యాణ్ సినిమాలో తాను పాట పాడినందుకు తనను ప్రభుత్వం గుర్తించి రాష్ట్రపతి, ప్రధాని చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మొగిలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ అనురాధ, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ శ్రీతేజ, స్థానిక నాయకులు ఆలే భాస్కర్ రాజ్, ఆలే జితేంద్ర, రూప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పద్మశ్రీ కిన్నెర మొగిలయ్య

గోషామహల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం


నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన పలు పార్టీల నాయకులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గోషామహల్ హిందీనగర్ బారాదారి ప్రాంతంలో పలు పార్టీలకు చెందినవారు నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి, సంక్షేమాన్ని చూసి అన్ని పార్టీల వారు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పార్టీని పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేసి బీజేపీని చిత్తుగా ఓడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జాంబాగ్ కో ఆర్డినేటర్ ఎస్.ధన్‌రాజ్, బీఆర్ఎస్ నేతలు యోగేష్‌యాదవ్, పప్పుమాత్రే, విజయ్‌పాటిల్, భజన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళలకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందని చెవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో దీపాంజలి నృత్య సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్యగురువు తెలంగాణ సంగీత నాటక అకాడమి అధ్యక్షురాలు దీపికారెడ్డి శిష్యురాలు సుముఖరెడ్డి కూచిపూడి నాట్య రంగప్రవేశం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పుష్పాంజలి, భామ కలాపం, థిల్లాన వంటి పలు అంశాలపై చక్కటి హావా భావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను సమ్మోహన పరిచాయి. సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, గాయని సునితా, తండ్రి వెంకట్రామిద్ది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణ

అబిడ్స్: ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ షేక్ ముజీబ్ ఉర్ రెహ్మాన్ పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన ఆయనను గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు మాణిక్ ప్రభు, బీజేపీ నాయకులు ప్రభు పూజారి, దర్పల్లి భరత్‌లు, ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా షేక్‌ముజీబ్ ఉర్ రెహ్మాన్ మాట్లాడుతూ.. స్థానిక బస్తీలు, కాలనీలు, అన్ని ప్రాంతాల్లో సెక్టర్లవారీగా తరచూ ఫ్రెండ్లీ పోలీసింగ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రజలకు, పోలీసులకు మధ్య మరింత స్నేహబంధం ఏర్పడే విధంగా కృషి చేస్తానన్నారు.


ఇన్‌స్పెక్టర్ షేక్ ముజీబ్ ఉర్ రెహ్మాన్‌ను సత్కరించిన మాణిక్ ప్రభు తదితరులు

మంత్రి కేటీఆర్‌ను కలిసిన మమతాగుప్తా



అబిడ్స్: నగర గ్రంథాలయ శాఖ డైరెక్టర్, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా అసెంబ్లీ వద్ద మంత్రి కేటీఆర్‌ను ఆదివారం కలిశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడం, గ్రేటర్ నలుమూలలా మెట్రోరైలు విస్తరణపై ఆమె కేటీఆర్ కృతజ్ఞతలు చెప్పారు.

మైసిగండి మైసమ్మకు మారుబోనం


అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న కమిటీ సభ్యులు

గౌలిపురా: గౌలిపురా మహంకాళి మాతేశ్వరీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మైసిగండి మైసమ్మ అమ్మవారికి మారుబోనం సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మానీ కైలాష్ గంగపుత్ర కమిటీ సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు, నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కె.ఎస్.ఆనంద్ రావు, పాశం సురేందర్, ఆలే జితేంద్ర, ఎ.మధుసూదన్ గిరి, ఇ.సుమన్ కుమార్, బి.వై.శ్రీకాంత్, బొడ్డు సాయిబాబా, జి.రమేష్, శంకర్, మహేందర్, గిరి, విక్రం, ఎం.వినోద్, కె.వెంకటేష్, ఎస్.దేవేందర్, రిషికేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పింక్ డయాగ్నోస్టిక్ సెంటర్ అండ్ పాలీ క్లీనిక్ వద్ద ఆదివారం జేమ్ కేర్ కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, గ్యాస్ట్రో, జనరల్ ఫిజిషియన్ తదితర పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. క్యాంపు కో ఆర్డినేటర్లు షేక్ ఇంతియాజ్, మహ్మద్ జాఫర్, షారూఖ్ హుస్సేన్, గౌస్ పాషా, మహ్మద్ ముబాషీరుద్దీన్ పాల్గొన్నారు. డాక్టర్ మీర్జా షేక్, డాక్టర్ ప్రేమ్‌లను ప్రజలు అభినందనలు తెలిపారు.

గోల్కొండ కోటకు పర్యాటకుల శోభ



గోల్కొండ: గోల్కొండ కోట మరోమారు పర్యాటక శోభను సంతరించుకుంది. కోటలో జరిగిన ఉత్సవాల నుంచి కోటకు వచ్చే పర్యాటకుల సంఖ్య భారీగా పెరుగుతూ వస్తుంది. ఆదివారం సెలవు రోజు కావడంతో కోటకు భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. పర్యాటకులతో గోల్కొండ కోటలో పని చేసే హిటరీ గైడ్స్‌కు చేతి నిండా పని లభించినట్లైంది. ఆదివారం వచ్చిన పర్యటకుల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులే ఎక్కువగా ఉండడం విశేషం. మొదటిసారి వచ్చిన పర్యాటకులు కోట క్లాప్లింగ్ పోర్టిపో వద్ద ఉన్న భారీ ఫిరంగి వద్ద సెల్ఫీలుదిగుతూ ముచ్చటపడ్డారు.

ఘనంగా సహస్ర కలశాభిషేకం

జియాగూడ: జియాగూడలో శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా సహస్ర కలశాభిషేక మహోత్సవం కనుల పండువగ జరిగింది. ఉదయం సంకల్పం, పవిత్ర జలాలతో స్వామికి మహాభిషేకం, భజన, బండ్దార ప్రసాద కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ ట్రస్టీ ఎస్‌టీ.చారి, ప్రతినిధులు శేషాచార్యులు, శ్రీనివాస రంగనాథచార్యులు, బద్రిచార్యులు పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


పూజలు నిర్వహించిన ఆలయ ప్రతినిధులు

జాబ్‌మేళాకు విశేష స్పందన

విజయనగర్‌కాలనీ: ప్రభుత్వ ఉద్యోగాలకు ధీటుగా ప్రైవేటు కంపెనీలు సైతం చక్కటి జీతభత్యాలను అందిస్తున్నాయని శాంతినగర్ ఐటీఐ ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీనివాస్ అన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయం, టాంకాం సంస్థలతో కలిసి శాంతినగర్ ఐటీఐలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. టీఎస్‌ఆర్టీసీ, ఐసీసీఐ ఫౌండేషన్, వరుణ్‌మోటార్స్, మెగా కన్‌స్ట్రక్షన్స్, ఎల్‌జీ, శ్యామ్‌సాంగ్, ఓల్టాస్, ఆస్ట్రా మైక్రోవేవ్ తదితర సంస్థలలోని వెయ్యి ఉద్యోగాల భర్తీకి రాతపరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించచారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాయిబాబా, ట్రైనింగ్ ఆఫీసర్ మధు, సూపరింటెండెంట్ షకీల్, మొహ్మద్ ఘోరి, ప్రవీణ్, కవిత, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి



చార్మినార్: అఖిల భారత గో సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నగరం నుంచి తిరుపతి, అరుణాచలం వరకు దాదాపు 789 కిలోమీటర్ల దూరం వరకు కాలినడకన ఆదివారం ఉదయం ప్రారంభించిన గో మహా పాదయాత్రకు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య స్వాగతం పలికి బాలకృష్ణ గురుస్వామిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవులను రక్షిద్దామని తద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ (బీజేపీ)శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి కృషి


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ మహ్మద్ ఖాజా ముజీబుద్దీన్

దూద్‌బౌలి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాషాభివృద్ధితో పాటు ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహ్మద్ ఖాజా ముజీబుద్దీన్ అన్నారు. అర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఉర్దూఘర్‌లో ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం కొనసాగింది. 2019–20, 2020–21, 2021–22 సంవత్సరాలకు గాను 213 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి వారికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు అందజేసి సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ, మైనార్టీ నాయకులు షమియుల్లా, మాజీ చైర్మన్ నూర్ ఉల్లా ఖాద్రీ పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం



రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇచ్చే పురస్కారాన్ని అందుకుంటున్న భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ కుమారుడు ప్రేమ్ కుమార్. – గౌలిపురా

లారీ ఢీకొని అడ్డా కూలీ మృతి

నాంపల్లి: లారీ ఢీకొని అడ్డా కూలీ వ్యక్తి మృతి చెందిన ఘటన నాంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలోని తెలుగు వర్సిటీకి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి వలస వచ్చి పబ్లిక్‌గార్డెన్ కేంద్రంగా నివాసం ఉండే ఓ గుర్తు తెలియని అడ్డా కూలీ ఆదివారం ఉదయాన్నే నాంపల్లిలో రోడ్డు దాటుతుండగా అఫ్జల్‌గంజ్ నుంచి కరీంనగర్‌కు సరుకు రవాణా చేసే లారీ ఢీ కొట్టింది. దీంతో అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని లారీతో పాటుగా డ్రైవర్ రాజును అదుపులోకి తీసుకున్నారు. తోటి పబ్లిక్‌గార్డెన్ అడ్డా కూలీలు అజయ్, అక్బర్ ఇచ్చిన ఆధారాల ప్రకారం మృతుడు నర్సింహ (40)గా గుర్తించారు. అతడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంబులెన్స్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల అంబులెన్స్ సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ ఆస్పత్రికి చెందిన 108, 102 సిబ్బందిని కలిశారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన సిబ్బంది సేవలను కొనియాడారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రికి కొత్తగా రెండు అంబులెన్స్‌లు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే గోల్కొండ ఏరియా ఆస్పత్రికి కొత్త బ్లాక్ పనులు కూడా ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. రాష్ట్ర మంత్రి హరీష్‌రావు గత అసెంబ్లీ సమావేశాల్లో గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు.


గోల్కొండ ఏరియా ఆస్పత్రి అంబులెన్స్ ఇబ్బందితో ఎమ్మెల్యే కౌసర్

'బీఆర్ఎస్‌లో కొత్త నిర్ణయాలు చెల్లవు'


మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ, అధ్యక్షుడు నరహరి చారి

జియాగూడ: బీఆర్ఎస్ పార్టీ హై కమాండ్ నుంచి ఎలాంటి ఆదేశాలు లేకున్నప్పటికీ ఉన్నఫలంగా జియాగూడ డివిజన్ అధ్యక్షుడిని తొలగించి మరొకరికి నియామక పత్రం అందించడం నియోజకవర్గం ఇన్‌చార్జ్ జీవన్‌సింగ్ తొందరపాటు చర్య అని జియాగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడ బీఆర్ఎస్ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు నరహరి చారి ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్వాన్ నియోజకవర్గం జియాగూడలో ఉద్యమకారులు, సీనియర్ నాయకులు ఎందరో ఉన్నారని, వీరందరికీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అందరితో కలిసి చర్చించి, సంప్రదించి నిర్ణయం తీసుకోవాల్సింది పోయి ఒంటెద్దు పోకడ సొంత నిర్ణయాల వల్ల నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు నర్మద, మాజీ అధ్యక్షుడు జడల మోహన్, మనోజ్ కుమార్, పాలెం వెంకటేష్, కె.నర్సింగ్‌రావు, నర్సింహా, సంతోషి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భగవద్గీత శ్లోకాలు

నాంపల్లి: శివానంద లహరి సంస్థ నిర్వహణలో ఆదివారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో భగవద్గీత భగవంతుని మధుర వాణి పేరిట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ విద్యార్థులు పలు భగవద్గీత శ్లోకాలను ఆలపించి ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా చిన్మయి మిషన్ హైదరాబాద్ సాక్షి స్వరూపానంద హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఏవీ కృష్ణారావు, చిన్మయి మిషన్ బాల విహార్ ప్రతినిధి కావేరి మాధురి, శివానంద లహరి సంస్థ అధ్యక్షుడు బి. వివేకానంద తదితరులు హాజరయ్యారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సాక్షి స్వరూపానంద స్వామిజీ

16న ఆటోబంద్

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16న ఆటోబంద్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆటోడ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్, చైర్మన్ జి.ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆటో కార్మికులు ఉన్నత విద్యను చదువుకున్నప్పటికీ ఉపాధి అవకాశాలు లేకపోవడంతో స్వశక్తితో ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఆర్‌బీఐ లైసెన్సు లేకుండా చట్ట వ్యతిరేకంగా కొనసాగుతున్న ఫైనాన్స్ సంస్థలను గుర్తించి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు మహ్మద్ అజీమొద్దీన్, మహ్మద్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆటోడ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లా ఖాన్ తదితరులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

అబిడ్స్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, రౌడీషీటర్లపై ఎలాంటి ఫిర్యాదులు అందినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ అన్నారు. ఆదివారం మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఆయా రౌడీషీటర్లపై పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు తరలిస్తామన్నారు. ఎస్ఐలు మహ్మద్ అస్లామ్, అంబికా పాల్గొన్నారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

తెలుగు వర్సిటీలో మద్యం బాటిళ్ల కలకలం



నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయం అసాంగిక కార్యక్రమాలకు నిలయంగా మారుతోంది. త్వరలోనే బాచుపల్లికి తెలుగు వర్సిటీ తరలిపోతున్న సందర్భంలో ఉద్యోగులందరూ కలిసి ఆదివారం నాంపల్లిలో బోనాలు పండుగను నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా తెలుగు వర్సిటీ ఉద్యోగులు విందును ఏర్పాటు చేసుకున్నారు. సెలవు రోజు కావడంతో ఉద్యోగులు, అధికారులు కలిసిరావడంతో వర్సిటీ ప్రాంగణమంతా సందడిగా దర్శనమిచ్చింది. వర్సిటీ ఆడిటోరియం వద్ద మద్యం బాటిళ్లు ప్రత్యక్షం కావడంతో సాయంత్రం జరిగిన ఓ ప్రైవేట్ సాంస్కృతిక కార్యక్రమానికి వచ్చిన సందర్శకులు బాటిళ్లను చూసి ఆశ్చర్యానికి లోనయ్యారు. అంతేకాకుండా ప్రాంగణంలోనే మహిళా హాస్టల్ కొనసాగుతోంది. ఇలాంటి తరుణంలో జరగరానిదేదైనా జరిగితే బాధ్యులెవరని పలువురు ప్రశ్నిస్తున్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మరు


మాట్లాడుతున్న మధుసుదన్‌గుప్తా, సంజయ్‌యాదవ్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మెస్థితిలో లేరని రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎస్.మధుసుదన్‌గుప్తా, సంజయ్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం గోషామహల్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పదేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమన్నారు. త్వరలోనే రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడిని కలిసి స్థానికులకే టికెటు ఇవ్వాలని స్థానిక సీనియర్ నాయకులంతా వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీకే మూర్తి, ఆర్.నరేందర్, శ్యామ్‌సింగ్, నిర్మల్‌కుమార్ యాదవ్, వినయ్‌కుమార్, కన్నుయాదవ్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల చోరీ

నాంపల్లి: నిలోఫర్ ఆస్పత్రి అత్యవసర సేవల విభాగంలో ఓ పీజీ విద్యార్థిని సెల్‌ఫోన్ మాయమైంది. ఈ సంఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిలోఫర్ ఆస్పత్రిలో జూలై 28న గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నిలోఫర్ ఆస్పత్రిలో మాళవిక అనే పీజీ విద్యార్థిని పనిచేస్తోంది. ఈ క్రమంలో తన ఐ ఫోన్–13 ప్రో ఫోన్‌ను వార్డులో ఉంచి సేవలందిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. బాధితురాలు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముత్యాల వ్యాపారి సెల్‌ఫోన్ చోరీ..

బంజారాహిల్స్ రోడ్డు నంబరు–11లోని ప్లాట్ నంబరు 92లో నివాసం ఉండే సచిన్ అగర్వాల్ ముత్యాల వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 5న సాయంత్రం వ్యాపార నిమిత్తం అబిడ్స్‌కు వచ్చారు. పని ముగించుకుని నాంపల్లి మీదుగా బంజారాహిల్స్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యలో స్నేహితులతో కలిసి నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని మోతీ వైన్స్ దగ్గర మద్యాన్ని సేవించారు. ఈ క్రమంలో తన జేబులో ఉన్న రూ.60వేలు విలువ చేసే ఐ–ఫోన్‌ను దొంగలు చోరీ చేశారు. దీంతో బాధితుడు నాంపల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.